**84**
**ధారావాహిక**



# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి
99893 71284

**జరిగిన కథ :** తన కొడుకు హరిహరుని మీద రాజవైద్యుని సహాయకుడు కొండుభొట్లు విషప్రయోగం చేసినట్లు అక్క నారాంబ చెప్పడంతో తీవ్ర ఉద్రేకానికి గురయ్యాడు జాయపుడు. కొండుభొట్లు హత్య కూడా అంతఃపుర ప్రయోగమేనని తెలిసి మ్రాన్పడిపోయాడు. మరునాడు చక్రవర్తి కొలువుకు వెళ్లాడు. జాయపుణ్ని కొంతకాలం వెలనాడు మండలేశ్వరునిగా నియమిస్తున్నట్లు ప్రకటించాడు చక్రవర్తి గణపతిదేవుడు. అయితే.. తను ఇక్కడ లేక పోతే తన అక్క, మేనల్లుళ్ల రక్షణ ఏమిటి?? అని ఆలోచిస్తూనే.. రాజపత్రం అందుకున్నాడు జాయపుడు.

చతుర్థ, పంచమ కులస్తులతో సహా అన్ని సామాజికవర్గాలు.. గ్రామరట్టలు, కరణాలు, విద్యావంతులైన పండితులు, సాహితీవేత్తలు, కళాకారులు, సమయాల సెట్టిలు, అవదేశిలు, పరదేశిలు, నానాదేశి పెక్కండ్రు, పంచాణం వారు, స్థపతులు, స్థానాపతులు, విదేశీ బేహారులు.. ఎంతోకొంత ప్రపంచ అవగాహన ఉన్నవారు కాబట్టి అన్నివృత్తులలో మేధావివర్గం అధికంగా ఉన్న ప్రాంతం వెలనాడు.

ఇటు సముద్రతీరం వల్ల విదేశీవ్యాపారంతో కోట్ల కోట్ల రూకల డబ్బు, మణుగుల కొద్దీ విదేశీ బంగారం ఇళ్లలో పాతరలు వేసి, గాదెల్లో పోసి, పుర్రెలు కట్టి మహారాజులకే అప్పులు ఇవ్వగల వణిక్ ప్రముఖులు, బలింజ వర్తకులు గ్రామగ్రామానా ఉన్నారు. చరిత్ర తొలిరోజుల్లోనే విదేశీ వాణిజ్యం జరుపుతూ ఐరోపా, మధ్య ప్రాచ్య, తూర్పు దేశాలలో విస్తృతంగా వాణిజ్య కార్యకలాపాలలో రాటుతేలిన మహానావికుల స్వర్ణ భూమి వెలనాడు.

వెలనాడుకు ఉన్న ఒకే ఒక్కశాపం అతివృష్టి, అనావృష్టి. ఇంత సౌభాగ్యం.. ఒక్క తుపానుతో సముద్రం పాలవుతుంటుంది. మళ్లీ కొత్త వ్యవసాయం మొదలుపెడతారు.. బతికి ఉన్న రైతులు.

ఇటు పడమట ప్రాంతం కర్మనాడు.. అదే కమ్మనాడుగా పిలుస్తున్నారు. విశ్వకర్మ వారసులుగా చెప్పుకొనే కార్మికులు.. ఏ వ్యాపారం, ఏ కోట నిర్మాణం, ఏ దేవాలయ నిర్మాణం, ఏ బిడారు.. దేనికైనా నాణ్యమైన అత్యుత్తమ సాంకేతిక నిపుణులు, మేధావులు, నిపుణులైన కార్మికులు దొరికేచోటు కర్మనాడు.

నాణ్యమైన బట్టను నేయడంలో ఈ రాజ్య నేతపనివారు ప్రపంచ ప్రఖ్యాతి పొందారు. రవ సెల్లాలు లేదా మస్లిన్ అనే పేరుతో ఇక్కడ నేసే వస్త్రం బుద్ధుని కాలానికి ముందే ప్రపంచ ప్రఖ్యాతి పొందింది. రాజకుటుంబాల వారికి కూడా కొనడానికి దొరకదు. పూర్తిగా ఎగుమతి ద్వారా గ్రీకు, రోమన్ దేశస్తులే.. కోరినంత బంగారం సంవత్సరాల ముందే చెల్లించి ముందస్తు ఒప్పందాల ద్వారా కొనుగోలు జరుపుతుండటం ఈ వస్త్రానికున్న ప్రత్యేకత. అలాగే నౌకా వ్యాపారం, నౌక నిర్మాణ సంస్థలు, నౌక మరమ్మత్తులు.. తోపాటు విదేశీ నౌకలు వచ్చినప్పుడు జరిగే చిల్లర వ్యాపారం ఈ గ్రామాల వాసులకు అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెడుతున్నాయి.

ఎంతోమంది కులీనులు ఆయా విదేశాలకు వెళ్లి వ్యాపారసంస్థలు, కూటములు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడి వాస్తు, శిల్పకళా చాతుర్యతను మరింత రంగరించి వెళ్లిన చోటల్లా ఎన్నెన్నో దేవాలయాలు నిర్మిస్తున్నారు. అక్కడే స్థిరపడుతున్నారు. రాజ్యాలు స్థాపిస్తున్నారు కూడా.

అలాంటి ప్రజా స్వర్గసీమ వెలనాడుకు రాజధాని ధనదప్రోలు. ధనదవ్రోలు, ధనదవోలు, సనదవోలు, సనదుపోలు.. ఇలా సామాన్య ప్రజలు, సాహితీవేత్తలు, శాసన లిపికారులు వారి ఇష్టానుసారం రాసే, పలికే ఈ